క్లుప్తంగా

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లతో విద్యార్థులు

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి చదివిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు సోమవారం అందజేశారు. ఇంటర్మీడియట్ చదువుతో పాటు ఉన్నత చదువులు కూడా బాగా చదవాలని ప్రధానోపాధ్యాయురాలు బి.ఉమావాణి ఆకాంక్షించారు.

ఆస్పత్రికి రోగుల తాకిడి



ఓపీ కోసం వేచి ఉన్న రోగులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. రోజురోజుకూ అనారోగ్యం బారినపడి ఆస్పత్రిలో చేరుతున్న వారి సంఖ్య సహా ఆస్పత్రికి వచ్చి వైద్య తనిఖీలు చేయించుకుంటున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. వేసవి ఎండల నేపథ్యంలో తీవ్ర జ్వరం, నీరసం, విరేచనాలు వంటి సమస్యలతో రోగులకు ఆస్పత్రికి వస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. సోమవారం అయితే 320 వరకు ఓపీ చూడడం జరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం బస్టాండ్ ఆవరణలో వాయుపుత్ర సేవా సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ పి.నారాయణరావు సోమవారం ప్రారంభించారు. అనంతరం అటువైపుగా వెళ్తున్న వారికి మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. వేసవి దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ప్రజలంతా సద్వినియోగించుకోవాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు బోటు అనీల్‌కుమార్, కొత్తకోట రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

భామిని: మండలంలోని పసుకుడి గ్రామంలో కబడ్డీ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల మృతి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి మువ్వల జయరాం జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్ద బోగాపురపు అప్పలనాయుడు తెలిపారు.

శిక్షణ ప్రారంభం



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న అధికారి లక్ష్మణరావు

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అటల్ టింకరింగ్, కంప్యూటేషన్ థింకింగ్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తులు వెలికితీయడమే లక్ష్యంగా ఈ శిక్షణ ఉంటుందని జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు తెలిపారు. ఈ శిక్షణలో ఏడు మండలాల నుంచి ఏడు పాఠశాలలకు చెందిన మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కళాకారులు

వీరఘట్టం: మండలంలోని ఎం.రాజపురానికి చెందిన బ్యాండ్ పార్టీ గాయకుడు మల్లేశు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తోటి కళాకారులంతా చందాల రూపంలో సేకరించిన రూ.43,300లను మల్లేశు కుటుంబానికి సోమవారం అందజేశారు. అనంతరం మల్లేశు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రక్తహీనత నివారణే లక్ష్యం కావాలి



గరుగుబిల్లి: అవగాహన ర్యాలీలో ఎంపీడీవో పైడితల్లి, ఐసీడీఎస్ సిబ్బంది

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ ఐసీడీఎస్ సిబ్బంది సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. రక్తహీనత నివారణే ధ్యేయంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ఆస్పత్రుల్లో ఉచిత వైద్య తనిఖీల సదుపాయంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందివ్వడం జరుగుతోందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అలాగే మూడేళ్ల వయసు వచ్చిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి, ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎల్. పాత్రుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, అరుణకుమారి, ఏపీఎం పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భామిని: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని బిల్లుమడ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో శాంతిభవానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు చీరలు, పండ్లు అందజేసి, ఆశీర్వదించారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యకక్రమంలో ఎస్‌వో జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి..

పాలకొండ రూరల్: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమలనాథ్ సూచించారు. మండలంలోని అదే గ్రామ పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అప్పుడే పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తప్పకుండా తల్లిపాలే ఇవ్వాలని తెలిపారు. అలాగే వేసవి ఎండల బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ..

సీతంపేట: ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్.. అది మెగా డీఎస్సీ కాదని దగా డీఎస్సీ అని జిల్లా ఏజేఏసీ చైర్మన్ కె.ధర్మారావు ఓ ప్రకటనలో సోమవారం విమర్శించారు. 2024 పోస్టులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించకుండా ఆయా పోస్టులను జనరల్ డీఎస్సీ నోటిఫికేషన్‌లో కలపడం అన్యాయమన్నారు. 100 శాతం పోస్టులు ఖాళీలు జీవో నంబరు 3 ప్రాప్తికి ఉంచకుండా, ప్రత్యేక డీఎస్సీ ప్రకటించకుండా ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. అరకు, కురుపాం పర్యటనల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందన్నారు. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రత్యేక డీఎస్సీపై అటు సీఎం, ఇటు విద్యాశాఖ మంత్రితో పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా పునరాలోచించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

సీతంపేట: ప్రభుత్వం జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ వల్ల ఆదివాసీలకు ఎటువంటి మేలు జరగనందున డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఖండిస్తున్నట్లు ఆదివాసీ జేఏసీ నాయకులు బి.రామ్మోహన్‌రావు, ఎస్.సింహాచలం, ఎం.ఉమామహేష్, తిరుమలరావు, మోహన్‌పాల్‌లు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. జీవో నంబరు 3ను అమలు చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 229 మంది దరఖాస్తు చేసుకోగా 211 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ తెలిపారు. మార్కుల మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

15 మరుగుదొడ్లు మంజూరు

గరుగుబిల్లి: మండలంలోని ఏడు పంచాయతీలకు 15 సామూహిక మరుగుదొడ్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గరుగుబిల్లికి 1, చిలకాంలో 2, కొంకడివరంలో 1, నాగూరులో 2, పెద్దూరులో 1, సంతోషపురం పంచాయతీలో 6, వల్లరగుడబలో 2 మరుగుదొడ్లు చొప్పున మంజూరయ్యాయన్నారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.3 లక్షల నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే రావివలస బీసీ వసతిగృహంలో రెండు మరుగుదొడ్లు, రావివలస ఎస్సీ వసతిగృహంలో ఒక మరుగుదొడ్డి నిర్మించడం జరుగుతుందన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించి, ప్రారంభించడం జరుగుతుందన్నారు.

వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: స్థానిక పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని, ఎటువంటి వాహన ధ్రువపత్రాలు లేని వారిని హెచ్చరించారు. వారి పెండింగ్ చలాన్లు తక్షణమే చెల్లించాలని సూచించారు. అలాగే ఎవరైనా మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడినా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపినా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు ఝాన్సీ, నారాయణరావు, ధర్మారావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకొండ: మండల కేంద్రంలో మండల రెల్లి ఉపకులాల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. రెల్లి ఉపకులాల అభివృద్ధి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి బాబ్జి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరగ్గా, అధ్యక్షుడిగా దేవపల్లి రాజు, ఉపాధ్యక్షులుగా ఇమిడిశెట్టి బోటు, సొండి ప్రభు, కార్యదర్శిగా ఇమిడిశెట్టి వంశీ, సహాయ కార్యదర్శులుగా లోకొండ మహేష్, సొండి సుదీర్, కోశాధికారిగా సొండి శ్రీను, ఆకుల నవీన్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా లోకొండ గణేష్, పిన్నింటి రాజ్‌కుమార్, కళింగపట్నం కిశోర్, న్యాయ సలహాదారుగా బెవర శివప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా మజ్జి బాబ్జీ ఎన్నికయ్యారు.


నేడు మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులంతా పూర్తిస్థాయి ప్రగతి నివేదికలతో హాజరుకావాలనిఆయన కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏఈ కోటేశ్వరరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు తమ సమస్యలు విన్నవించుకోవాలని తెలిపారు. ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు బి.సురేఖరాణి, ఆర్థిక సభ్యుడు సుబ్బారావు, స్వతంత్ర సభ్యుడు ఎన్.మురళీకృష్ణ హాజరవుతారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బహుమతి తెచ్చిన కార్టూన్



బహుమతి పొందిన కార్టూన్ ఇదే..

గరుగుబిల్లి: అడవులలో జంతువులను మనుషులు హింసించి చంపడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో ఆ వన్యప్రాణులే మనిషి చర్యలను నిలువరించి తోటి వన్యప్రాణులను రక్షించుకుంటున్నాయని తెలిపేలా మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన కార్టూన్‌కు మొదటి బహుమతి లభించింది. విశాలక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహించిన కార్టూన్ పోటీల్లో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది.

● తవ్వేస్తున్నారు..!



రామభద్రపురం ఇసుక ర్యాంపు వద్ద పొక్లెయిన్‌తో తవ్వకాలు



ఇసుక తవ్వకాలుతో ఏర్పడిన భారీ గొయ్యి

కొమరాడ మండలంలోని కూనేరు రామభద్రపురం, కొమరాడ, కొట్టు, కొరిశీల, నిమ్మలపాడు, కళ్లికోట తదితర ప్రాంతాల్లో నాగావళి నదిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పొక్లెయిన్లతో లారీలు, ట్రాక్టర్లకు లోడ్‌చేసి రాత్రీ పగలు తేడాలేకుండా విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు తరలిస్తున్నారు. కూటమి నాయకులు దగ్గరుండి ఇసుక తవ్వకాలు జరిపిస్తూ రెండుచేతులా ఆర్జిస్తున్నట్టు సమాచారం. నదిలో పెద్దపెద్ద గోతులు పెడుతుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులకు తెలిసినా మిన్నకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని కొమరాడ డిప్యూటీ తహసీల్దార్ శివయ్య వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ఇసుక అక్రమ తవ్వకాల అంశం తమ దృష్టికి రాలేదని, చర్యలు తీసుకుంటామన్నారు. – కొమరాడ



నదీ గర్భంలోనే భారీగా ఇసుక నిల్వలు

వసూళ్లకు పాల్పడితే చర్యలు

మక్కువ: ఉపాధి హామీ పథకం వేతనదారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీఓ స్వరూపారాణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని అడిగిన ప్రతీ ఒక్కరికి సకాలంలో పనులు అందించాలని, గరిష్ట వేతనం రూ.300 లు వేతనదారులు పొందేలా కొలతలు ఇవ్వాలన్నారు. ఎండల తీవ్రత ఉన్నందున రెండు పూటలా పనులు నిర్వహించి, పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. మేట్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ శంబంగి ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు హాజరై, తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ వారి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. మొత్తం 44 వినతులు రాగా, వాటిలో తాగునీటి సదుపాయం కల్పించాలని నేలబొంతుకాలనీ గిరిజనులు, రోడ్లు నిర్మించాలని అంబలిగండి, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని గజపతినగరానికి చెందిన బి.కిశోర్, వరదగోడలు (రిటైనింగ్ వాల్) నిర్మించాలని పనసలోవ గ్రామస్తులు సమర్పించిన వినతులు కొన్ని ఉన్నాయి. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్వీ గణేష్, ఈఈ రమాదేవి, ఐసీడీఎస్ పీవో రంగలక్ష్మి, హెచ్‌వో జయలక్ష్మి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ అధికారులు

పాలకొండ రూరల్: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ బి.మాధవరావు లబ్ధిదారులకు సూచించారు. స్థానిక రామకళామందిర్ సచివాలయం పరిధిలో ఇళ్లస్థలాలు పొంది, నిర్మాణాల్లో జాప్యం వహిస్తున్న పలువురు లబ్ధిదారులకు సోమవారం ఇళ్ల నిర్మాణాల పూర్తిపై అవగాహన కల్పించారు. గతంలో నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందించారని, ఇప్పుడు అదనంగా ఎస్టీలకు రూ.75 వేలు, ఇతరులకు రూ.50 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయా మొత్తాలను సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటికే అర్బన్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు తాగునీటి పైపులైన్లు వేయడం జరిగిందని, రక్షిత మంచినీటి పథకం కూడా నిర్మాణ దశలో ఉందన్నారు. ఆయన వెంట హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కోట చిరంజీవి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



వీరఘట్టం: తలవరం ప్రాథమిక పాఠశాలలో చిన్నారులను చేర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



గుమ్మలక్ష్మీపురంలో అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందించడం జరుగుతోందని, తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి, మండల కేంద్రంలో విద్యాశాఖాధికారులు బి.చంద్రశేఖర్, బి.భీముడు సోమవారం చేపట్టిన అడ్మిషన్ డ్రైవ్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ విద్య పూర్తి చేసుకున్న ఐదేళ్ల వయసున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తూ వారికి ఎమ్మెల్యే అడ్మిషన్ పత్రాలు అందజేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదవడం ద్వారా కలిగే ప్రభుత్వ సదుపాయాలను ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, తహసీల్దారు ఎన్.శేఖర్, ఐసీడీఎస్ పీవో ఎన్.రాజ్యలక్ష్మి, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని తలవరం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్య పూర్తి చేసుకున్న ఐదేళ్ల వయసు చిన్నారులను ఆ గ్రామ మండల పరిషత్ పాఠశాలలో చేర్పించారు. వారందరికీ ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తూ అడ్మిషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లంఊట ధ్వంసం

సీతంపేట: మండలంలోని కుశిమిగూడ పరిసరాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సారాబట్టీలపై టాస్క్‌ఫోర్స్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు వెయ్యి లీటర్ల బెల్లంఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. అలాగే సారా ఊట తయారీకి వినియోగించేందుకు సిద్ధం చేసిన 1312 కిలోల బెల్లం కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సవర బాపడు, రాము అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ సూర్యకుమారి తెలిపారు.

విద్యార్థులకు ఎమ్మెల్సీ అభినందన



విద్యార్థులకు స్వీట్లు తినిపించి అభినందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

జియ్యమ్మవలస రూరల్: జవహర్ నవోదయకు ఎంపికైన మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమల సాయి పాఠశాల విద్యార్థులను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అభినందించారు. సోమవారం ఆ పాఠశాలను సందర్శించిన ఆయన.. నవోదయలో సీట్లు సాధించిన 8 మంది విద్యార్థులకు స్వీట్లు తినిపించి, మరింత బాగా చదివి ఉన్నత చదువులు చదవాలని ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్సీని పాఠశాల యాజమాన్యం సత్కరించింది. ప్రతి ఏటా తమ పాఠశాల పది మందికి తక్కువ కాకుండా జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికవుతారని, ఈ ఏడాది 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రౌతు సరళకుమారి తెలిపారు. ఇదే ప్రోత్సాహంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యనందించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎమ్మెల్సీ తెలిపారు. పీఆర్‌టీయూ నాయకులు ఓలేటి తవిటినాయుడు, జి.ప్రభాకరరావు, జె.రామినాయుడు, బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించాలి

బలిజిపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేద, బలహీన వర్గాల పిల్లల కోసం ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించాలని ఎంఈఓ–1 సామల సింహాచలం సూచించారు. ఎంఈఓ కార్యాలయంలో ప్రైవే టు పాఠశాలల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 12(1) ప్రకారం పేద, బలహీన వర్గాల పిల్లలకు అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో 1వ తరగతి ప్రవేశాలలో 25శాతం సీట్లు ఉచితంగా కల్పించాలని ప్రతినిధులకు తెలిపారు. వీటికి సంబంధించిన ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే 15వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

మక్కువ: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థులు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి పెంట సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28 నుంచి మే 15వ తేదీలోపు బడుగు, బలహీన వర్గాలు, దారిద్ర్య రేఖకు దిగువనున్న విద్యార్థులకు 25 శాతం సీట్లు ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు కేటాయించాల్సి ఉందన్నారు. పాఠశాలలో ప్రవేశానికి జూన్ 1 నాటికి విద్యార్థులకు, ఐదు సంవత్సరాలు నిండి ఉండాలన్నారు.

అమ్మవారికి ఆహ్వానం



పట్టణంలో అమ్మవారి కోనితెచ్చు ఊరేగింపు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామ దేవతలు ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ పండగను ఘనంగా నిర్వహించేందుకు పట్టణ పెద్దలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పండగలో భాగంగా పొలిమేరలో ఉన్న ఇప్పల పోలమ్మ అమ్మవారిని ప్రజలు, పెద్దలు ఏకమై పిలుపునిచ్చే (కోనితెచ్చు) కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. పొలిమేర నుంచి గ్రామంలోకి ప్రవేశించిన అమ్మవారిని మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో అమ్మవారి ఘటాలతో 40 రోజులు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి పూజ కార్యక్రమం పార్వతీపురం రాజులు తాట్రాజ్ కుటుంబం ఘనంగా నిర్వహిస్తారన్నారు. అనంతరం గ్రామమంతా ఘట్టాలు ఊరేగింపు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గ్రామ దేవత ఇప్పల పోలమ్మకు జరిగిన పద్ధతిలోనే జగన్నాధపురం ఎర్ర కంచమ్మ పండగ ఏర్పాట్లు కూడా ఇదే పద్ధతిలో జరుగుతాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు. పార్వతీపురం గ్రామదేవత ఇప్పల పోలమ్మ, జగన్నాధపురం ఎర్రకంచమ్మ ఇరు గ్రామ దేవతల పండగ జూన్ 1, 2, 3 తేదీల్లో జరగనున్నాయని, రెండు సిరిమాను మహోత్సవాలు సంబరాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.